ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

సోమవారం 10-08-2026

మొదటి పేజి తరువాయి

## గిరిజన బిడ్డలు అడవిని అమ్మగా ఆరాధిస్తారు అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు చేస్తారు

అయితే, గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో 2020లో సుప్రీంకోర్టు ఆ జీవోను కొట్టివేసిందని తెలిపారు. సుప్రీంకోర్టులో గత ప్రభుత్వం సరైన వాదనలు వినిపించకపోవడం వల్లే గిరిజనులకు ఈ అన్యాయం జరిగిందన్నారు. గిరిజనుల హక్కుల కోసం తమ ప్రభుత్వం పోరాడుతుందని స్పష్టం చేశారు. గిరిజనులకు లబ్ధి చేకూరేలా త్వరలో అందరికీ ఆమోదయోగ్యమైన సరికొత్త విధానాన్ని తీసుకొస్తామని సీఎం హామీ ఇచ్చారు. 2027 నాటికి అందరికీ ఇళ్లు : రాష్ట్రంలో మొత్తం 29 లక్షల మంది గిరిజనులు ఉన్నారని సీఎం తెలిపారు. వారి అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. గిరిజనులకు విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. 2027 డిసెంబరు నాటికి రాష్ట్రంలోని గిరిజనులందరికీ పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. అలాగే వారందరికీ సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. 9 ఐటీడీఏ కేంద్రాల అభివృద్ధితో రానున్న రోజుల్లో మంచి ఫలితాలు వస్తాయన్నారు. మారుమూల గిరిజన తండాల్లో టెలికాం కనెక్టివిటీ పెంచేందుకు టెలీకమ్యూనికేషన్స్ సంస్థలతో ఒప్పందం చేసుకున్నట్లు వివరించారు. 2047 నాటికి 'వికసిత్ భారత్', 'స్వర్ణాంధ్ర' కలలు సాకారం అవుతాయని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన బిడ్డలు ఆవేశానికి లోనుకాకుండా, ఆలోచనతో ముందుకు సాగాలని సూచించారు. దేశం మనకు ఏమి ఇచ్చిందనేది కాకుండా, దేశానికి మనం ఏం ఇస్తున్నామనే ఆలోచన ప్రతి ఒక్కరిలో రావాలన్నారు. అడవి బిడ్డలు బాగా చదువుకుని ఐఐటీల స్థాయికి వెళ్లగలిగితే దేశానికి ఎంతో ఉపయోగపడినట్లే అని చెప్పారు. తాను ప్రజాప్రతినిధిగా ఎన్నికైనప్పటి నుంచి ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదని గుర్తుచేశారు. ప్రజల జీవితాలను మార్చగలిగితే చాలు, అదే తనకు దక్కే అసలైన ఆనందమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. "దేశం మనకు ఏమిచ్చిందనేది కాకుండా దేశానికి మనం ఏం ఇస్తున్నామనే ఆలోచన ప్రతి ఒక్కరికీ రావాలి. అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు చేయగల సామర్థ్యం ఆదివాసీలకు ఉంది. సామాన్య కుటుంబంలో పుట్టి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన ద్రౌపది ముర్ము జీవితం అడవి బిడ్డలకు ఆదర్శం. గిరిజన బిడ్డలు బాగా చదువుకొని ఐఐటీలకు వెళ్లాలి. వికసిత్ భారత్‌లో అనుసంధానం కాగలిగితే ఆకాశమే హద్దుగా ఎదగవచ్చు. వైఎస్సార్సీపీ ప్రభుత్వ వైఫల్యం వల్లే సుప్రీంకోర్టు జీవో నంబర్ 3ను కొట్టివేసింది. గిరిజనులకు లబ్ధి జరిగేలా మళ్లీ అందరికీ ఆమోదయోగ్యమైన కొత్త విధానం తీసుకొస్తాం."

## తిరుమలలో కొనసాగుతున్న భక్తుల భారీ రద్దీ

కిలోమీటర్ల మేర బారులు తీరిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి సుమారు 20 నుంచి 24 గంటల సమయం పడుతోందని అధికారులు వెల్లడించారు. నిన్న (ఆగస్టు 8) మొత్తం 87,658 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 40,606 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.13 కోట్లుగా నమోదైంది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు 4.15 లక్షల లడ్డూలను విక్రయించగా, 3.09 లక్షల మందికి అన్నప్రసాదం అందించారు. వారాంతం కావడంతో భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగినట్లు తెలుస్తోంది. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు టీటీడీ అధికారులు తాగునీరు, ఆహారం వంటి సౌకర్యాలు కల్పిస్తూ రద్దీని క్రమబద్ధీకరించే ప్రయత్నాలు చేస్తున్నారు. భారీ రద్దీ నేపథ్యంలో, తిరుమలకు వచ్చే భక్తులు ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణాన్ని ప్రణాళిక చేసుకోవాలని టీటీడీ సూచిస్తోంది.

## అమెరికాలో డాక్టర్ రాజా కుమారుడి వివాహానికి హాజరైన మంత్రి నారా లోకేశ్

వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆనందంగా సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలో లోకేశ్ దంపతులు సంప్రదాయ దుస్తులలో కనిపించారు. కార్యక్రమానికి వచ్చిన పలువురితో వారు కాసేపు ముచ్చటించారు. ఈ వేడుకకు సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## ప్రియాంక ఘటనపై అధికారులతో హోం మంత్రి అనిత సమీక్ష.. కఠిన చర్యలకు ఆదేశం

విశాఖపట్నం, ఆగస్టు 9: వైద్య విద్యార్థిని ప్రియాంకను కారుతో ఢీకొట్టిన ఘటనపై జిల్లా ఎస్పీతో ఎప్పటికప్పుడు ఫోన్‌లో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత.. కేసు దర్యాప్తు, తదుపరి చర్యలపై ఆరా తీస్తున్నారు. అలాగే ప్రియాంక తండ్రి వెంకటేష్‌తో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆయనకు భరోసా ఇచ్చారు. ప్రియాంక కుటుంబానికి న్యాయం జరిగేలా పోలీసులు చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటున్నారని హోం మంత్రి స్పష్టం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు స్పందించారని, కేసులో ఇప్పటికే నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని అనిత వెల్లడించారు. ఘటనపై దర్యాప్తును వేగవంతం చేసి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని మరోసారి భరోసా ఇచ్చారు.

## ట్రంప్‌కు ఝులకిచ్చిన బెంజిమిన్ నెతన్యాహు

కాగా తాజాగా ఈ పాలసీని వ్యతిరేకిస్తూ నెతన్యాహూ బాంబు పేల్చారు. నెతన్యాహూ తన వ్యాఖ్యల్లో "15-సూత్రాల పత్రాన్ని ఇజ్రాయెల్ తిరస్కరిస్తుంది. హమాస్ నిజంగా నిరాయుధులయ్యే వరకు ఐడిఎఫ్ ఎలాంటి ఉపసంహరణ చేపట్టదు. మన బలగాలకు, మన పౌరులకు ఎదురయ్యే ముప్పులను అడ్డుకుంటూనే ఉంటుంది," అని ఇజ్రాయెల్ రక్షణ దళాలను ప్రస్తావిస్తూ నెతన్యాహు క్యాబినెట్ సమావేశంలో అన్నారు. దీంతో మరోసారి పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఇజ్రాయెల్ నిర్ణయంతో గాజాలో శాంతిని స్థాపించడానికి హమాస్‌ను నిరాయుధులను చేయడానికి జరుగుతున్న అంతర్జాతీయ ప్రయత్నాలు మళ్లీ నిలిచిపోయే ప్రమాదం ఉంది. హమాస్ పూర్తిగా ఆయుధాలు విడిచిపెట్టే వరకు ఇజ్రాయెల్ సైన్యం తమ ప్రస్తుత స్థానాల నుంచి వెనక్కి వెళ్లేది లేదని తేల్చిచెప్పడంతో.. గాజాలో సైనిక ఉద్రిక్తతలు దాడులు కొనసాగే అవకాశం ఉంది.

## పెద్ది సుదర్శన్‌రెడ్డితో అనుబంధాన్ని గుర్తుచేసుకొని భావోద్వేగానికి గురైన కేసీఆర్ - రూ.2.25 కోట్ల సాయం అందజేత

చేసిన కేసీఆర్, పెద్ది సుదర్శన్‌రెడ్డితో తన అనుబంధం గుర్తుచేసుకొని కేసీఆర్ భావోద్వేగానికి గురయ్యారు. సుదర్శన్‌రెడ్డి ఉద్యమ ఘట్టాల ఫొటోలు చూస్తూ జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. సుదర్శన్‌రెడ్డి అత్యంత సాదాసీదా జీవితం గడిపారన్నారు. పెద్ది కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్న కేసీఆర్ , పార్టీ తరఫున రూ. 2.25 కోట్ల అందించారు. కేసీఆర్ రాక సందర్భంగా బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలతో నల్లబెల్లి గ్రామం జనసంద్రంగా మారింది. జోహార్ పెద్ది సుదర్శన్ రెడ్డి, జై కేసీఆర్ అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు.

## కోల్‌కతాలో తప్పిన భారీ ప్రమాదం.. లేజర్ లైట్ల ఎఫెక్ట్.. గాల్లోనే విమానం చక్కర్లు..!



విమానాశ్రయ రన్‌వేకు సుమారు 8 నాటికల్ మైళ్ల దూరంలో విమానం ఉన్నప్పుడు మధ్యమ్‌గ్రామ్-బరసాత్ దిశ నుంచి కాక్‌పిట్ వైపు లేజర్ లైటింగ్ పడినట్టు పైలట్ గమనించాడని సంబంధిత వర్గాలు తెలిపాయి.

### చివరికి సేఫ్ ల్యాండింగ్ :

లేజర్ నుంచి ఒక్కసారిగా వచ్చిన కాంతి కారణంగా పైలట్ క్షణకాలం పాటు అయోమయంగా అనిపించింది. దాంతో విమానం అనుకున్న సమయానికి ల్యాండ్ అవ్వలేకపోయింది. మరోసారి ల్యాండ్ చేసేందుకు ప్రయత్నించే ముందు గాలిలో చక్కర్లు కొట్టాల్సి వచ్చింది. చివరకు రాత్రి సుమారు 11:25 గంటలకు విమానం సేఫ్ ల్యాండ్ అయింది. ప్రయాణీకులు, సిబ్బంది అందరూ క్షేమంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

### ఘటనపై పోలీసులకు ఫిర్యాదు :

ఈ ఘటన అనంతరం.. విమానయాన సంస్థ విమానాశ్రయ అధికారులకు సమాచారం అందించింది. కోల్‌కతా విమానాశ్రయ యంత్రాంగం కూడా నేతాజీ సుభాష్ చంద్ర బోస్ అంతర్జాతీయ విమానాశ్రయ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వర్గాలు చెబుతున్నాయి. విమానాశ్రయం పరిసరాల్లో లేజర్ లైట్ల వాడకం నిషేధించినట్టు కోల్‌కతా విమానాశ్రయ డైరెక్టర్ విక్రమ్ సింగ్ తెలిపారు. అయినప్పటికీ, ఇలాంటి సంఘటనలు అప్పుడప్పుడు జరుగుతూ ఉంటాయని, విమాన కార్యకలాపాలపై ప్రభావం చూపుతున్నాయని అన్నారు. ఈ విషయాన్ని పోలీసు అధికారులకు రిపోర్టు చేశామని, దర్యాప్తు జరుగుతోందని ఆయన అన్నారు. టేకాఫ్, ల్యాండింగ్ సమయంలో లేజర్ లైట్ల వల్ల ఆటంకం కలుగుతోందని పైలట్లు గతంలోనే ఫిర్యాదు చేశారు. 2025లో దుర్గా పూజ సందర్భంగా శ్రీభూమి స్పోర్టింగ్ క్లబ్ పూజా పందల్ సమీపంలో లేజర్ లైట్లపై పైలట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ తర్వాత, లేజర్ షోను నిలిపివేశారు.

## కుమురం భీమ్ ఆశయాల సాధనకు అందరూ ఐక్యంగా కృషి చేయాలి

మొదటి పేజి తరువాయి



పోరాడినటు వంటి కుమురం భీమ్ వరకు ఎంతో స్ఫూర్తి పొందామని చెప్పుకొచ్చారు. రాజ్యాంగంలో చూస్తే మనకు ప్రత్యేక స్వయం ప్రతిపత్తి, ప్రత్యేక భూ హక్కులు, ప్రత్యేక ఉద్యోగ, ఉపాధి హక్కులు ఉన్నాయని ప్రస్తావించారు. ఆనాడు అంబేద్కర్, నెహ్రూ ఇద్దరు కలిసి మన జాతికి స్వయం ప్రతిపత్తి ఉండాలని 5వ షెడ్యూల్ ఏరియా ఏర్పాటు చేశారని వివరించారు. మన ప్రాంతాలకు 6వ షెడ్యూల్ ప్రకారం.. ఈశాన్య రాష్ట్రాలకు మణిపూర్, అస్సాం, సిక్కిం అలాంటి రాష్ట్రంలో ప్రత్యేక ప్రతిపత్తిని కూడా ఇచ్చారని మంత్రి సీతక్క తెలిపారు. ఇప్పుడు కూడా తమకు ఎవరితో శత్రుత్వం లేదని అన్నారు. ఈ జాతి సోదరులకు కూడా చెబుతున్నా ఏ కులాన్ని మనం ద్వేషించాల్సిన అవసరం లేదని చెప్పారు. ఏ ప్రాంత ప్రజలను వ్యతిరేకించాల్సిన అవసరం లేదని.. కానీ న్యాయంగా రావలసిన హక్కుల కోసం తాము అడుగుతామని అన్నారు. గిరిజనేతరుడైన నాయకుడు అల్లూరి సీతారామరాజు ఈరోజు అదే స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇంకా మన్యం బిడ్డలు పోరాడుతూనే ఉన్నారని చెప్పారు. ఎవరికీ తాము వ్యతిరేకం కాదని, ఎవరిని ఈ జాతి వ్యతిరేకించలేదని, ఎవరు వచ్చినా అక్కున చేర్చుకున్నామని వెల్లడించారు. ఇక్కడ ఉన్నటువంటి ప్రత్యేక అవకాశాలను కచ్చితంగా ఉపయోగించుకునే హక్కు రాజ్యాంగం ఇచ్చిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎప్పుడూ అడవి బిడ్డలు, పేదలు, బడుగు బలహీన వర్గాలంటే ప్రత్యేకమైన అభిమానమని చెప్పారు. దేశంలో ఎక్కడ జరగని కులగణనను చేశారని.. బీసీల కోసం కులగణన చేశారని మంత్రి సీతక్క ప్రస్తావించారు. దళితుల్లో ఉండే సమస్యను కూడా పరిష్కరించామని చెప్పారు. ఆదివాసీల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రి స్థాయిలో నిరంతరం ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. భూముల సమస్యలు సహా గిరిజనుల సమస్యలను తాము ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నామని వెల్లడించారు. ఏదైనా సమస్య పరిష్కారం కోసం పేదలు, నిరక్షరాస్యులు వస్తే వారిని అధికారులు నిర్లక్ష్యం చేయకుండా గౌరవంగా చూడాలని సూచించారు. ప్రజల వినతులను స్వీకరించి వారి కష్టాలకు పరిష్కరించాలని ఆదేశించారు. కుమురం భీమ్ పోరాట స్ఫూర్తితో గిరిజన హక్కుల సాధనకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మన భాష, వేషధారణ, సంస్కృతి గిరిజనుల అస్తిత్వం నిలుపుకోవడం మన బాధ్యత అని చెప్పారు. భవిష్యత్తు తరాలకు అందించాల్సిన గొప్ప ఆస్తి మన సంస్కృతి అని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐ వద్దు.. విద్యార్థుల నిరసన!

మొదటి పేజి తరువాయి



హైదరాబాద్ : హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు నిరసన గళం విప్పారు. ఈ మేరకు దాదాపు 450 మంది విద్యార్థులు సంతకాలు చేసి విశ్వవిద్యాలయ యాజమాన్యానికి ఒక లేఖ రాశారు. ఈ పరిణామం తెలంగాణ న్యాయ విద్యా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే, 2026 బ్యాచ్ స్నాతకోత్సవానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించే ప్రతిపాదనను విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఢిల్లీలో జరిగిన నీట్ నిరసనలపై సుప్రీంకోర్టులో జూలై 22న జరిగిన విచారణ సందర్భంగా సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం చేసిన వ్యాఖ్యలే ఈ నిరసనకు ప్రధాన కారణం. ఆ రోజు విచారణ సందర్భంగా, నిరసనకారులపై పోలీసుల చర్యకు సంబంధించిన వీడియోలపై సుమోటో విచారణ చేపట్టడానికి ధర్మాసనం నిరాకరించింది. ఈ క్రమంలో సీజేఐ, "వీడియోలు చూసే ఆసక్తి మాకు లేదు," "మా సమయాన్ని, మీ సమయాన్ని వృథా చేయకండి" వంటి వ్యాఖ్యలు చేశారని విద్యార్థులు తమ లేఖలో పేర్కొన్నారు. సీజేఐ వ్యాఖ్యలు అసంబద్ధంగా, బాధ్యతారహితంగా ఉన్నాయని, అందుకే ఆయనను స్నాతకోత్సవానికి పిలవరాదని వారు డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్‌కు మద్దతుగా విద్యార్థులు ఇప్పటికే ఒక పూట భోజనం చేయకుండా నిరసన తెలిపారు. తమ అభ్యర్థనను యాజమాన్యం పట్టించుకోకపోతే, వారం రోజుల నోటీసు ఇచ్చి ఆందోళనలు మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అయితే, నల్సార్ యాజమాన్యం స్నాతకోత్సవం తేదీని గానీ, ముఖ్య అతిథిని గానీ అధికారికంగా ఇంకా ప్రకటించలేదు. కానీ, ప్రతి ఏటా సీజేఐని స్నాతకోత్సవానికి ఆహ్వానించడం నల్సార్‌లో ఒక సంప్రదాయంగా వస్తోంది. కాగా, సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ విద్యార్థుల నిరసనను ఎదుర్కోవడం ఇది రెండోసారి. ఈ నెల మొదట్లో ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ లో జరగాల్సిన 86వ స్నాతకోత్సవానికి కూడా ఆయనే ముఖ్య అతిథిగా హాజరు కావాల్సి ఉంది. అయితే, ఎస్ఎఫ్ఐ అనుబంధ విద్యార్థులు నిరసన తెలిపే అవకాశం ఉందన్న ఇంటెలిజెన్స్ సమాచారంతో ఆ కార్యక్రమాన్ని చివరి నిమిషంలో వాయిదా వేశారు. ఇప్పుడు టిస్ తర్వాత నల్సార్‌లోనూ అదే పరిస్థితి పునరావృతం కావడం గమనార్హం. విద్యార్థుల లేఖతో నల్సార్ యాజమాన్యం ఇప్పుడు ఇరకాటంలో పడింది.

## చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తాం

మొదటి పేజి తరువాయి

భావితరాలకు స్వాతంత్ర్య సమరయోధుల గురించి తెలియజేయాలి: పెమ్మసా

కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. 'జీహెచ్ఎంసీ ఎన్నికల వేళ చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని నేను దర్శించుకుంటే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హేళన చేశారు. నేడు కేటీఆర్‌కు జ్ఞానోదయమైంది. అందుకే భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చారు. బీఆర్ఎస్ పాలనలో లాల్ దర్వాజ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ. 20 కోట్లు ఇస్తానని కేసీఆర్ మోసం చేశారు. ప్రజలనే కాదు.. దేవుళ్లనూ మోసం చేసిన చరిత్ర కేసీఆర్‌ది. అందుకే ఆ పార్టీని ప్రజలు ఓడించారు. లాల్ దర్వాజ బోనాలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 5.50 లక్షలు మాత్రమే ఇచ్చింది. లక్ష మంది భక్తులు దర్శించుకునే ఆలయానికి ఆ పైసలు ఏ మూలకు సరిపోతాయి?. రంజాన్‌కు రూ.33 కోట్లు ఇచ్చి, 80 శాతం ఉన్న హిందువుల ఆలయాలకు రూ.20 కోట్లు మాత్రమే ఇస్తారా?. ఒవైసీ బాధపడతారనే సింహవాహిని అమ్మవారి ఆలయ అభివృద్ధికి నిధులు ఇవ్వడం లేదు. పాతబస్తీలో పన్నులు కట్టేది హిందువులే. మా పైసలు మాకు ఇవ్వడానికి ఏం నొప్పి?. నేను ప్రశ్నిస్తే మతతత్వవాది అని ముద్ర వేస్తారా?, పాతబస్తీ బరాబర్ హిందువులదే. హిందూ సమాజాన్ని జాగృతం చేయడమే నాకు ముఖ్యం. నన్ను విమర్శించే నాయకులు ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకోవాలి. హిందువులారా.. అందరం సంఘటితమై కాంగ్రెస్, బీఆర్ఎస్ మెడలు వంచుదాం. జెన్-జీ తరం ఉద్యమ, ఆధ్యాత్మిక స్ఫూర్తిని హిందువులు అర్థం చేసుకోవాలి. జెన్-జీ లారా.. హిందూ సంఘటితం కోసం ఉద్యమించండి. బీజేపీ అధికారంలోకి వస్తే పాతబస్తీలో బోనాల ఉత్సవాలను సకల సౌకర్యాలతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తాం. ఊహించని విధంగా నిధులను ఖర్చు చేస్తాం. భాగ్యలక్ష్మి అమ్మవారి



ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తాం. సనాతన ధర్మం కోసం పాటుపడే యువతరానికి శక్తిని ప్రసాదించాలని సింహవాహిని అమ్మవారిని వేడుకుంటున్నా' అని పేర్కొన్నారు.

## పోలీసుల ఎదుటే అసాంఘిక శక్తుల దాడి- నా ప్రాణాలే పోయేవి'- బీజేపీపై మమత ఫైర్

మొదటి పేజి తరువాయి



ప్రాణాలు కోల్పోయేవాళ్లం. ఇదంతా పోలీసుల సమక్షంలోనే జరిగింది. ఇలాంటి పరిస్థితిని నేను ఎప్పుడూ చూడలేదు. అసలు ఏం జరుగుతోంది? నన్ను లక్ష్యంగా చేసుకోవడానికి బీజేపీ ప్రభుత్వం గూండాలను వాడుకుంటోంది. వారికి పోలీసులు రక్షణ కల్పిస్తున్నారు." - మమతా బెనర్జీ, బంగాల్ మాజీ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి

### ఇంతకీ ఏం జరిగింది?

టీఎంసీకి చెందిన కార్యకర్త బిర్జు కియోట్ . ఆయన కాంచరపారా మాజీ మున్సిపల్ కౌన్సిలర్ జెనీ శర్మ భర్త. దోపిడీ సహా పలు ఆరోపణలపై ఆయనను హాలిసహర్ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం ఆయనను కోర్టులో హాజరుపరచగా, ఐదు రోజులపాటు పోలీసు కస్టడీకి అప్పగించారు. అయితే ఆయన కస్టడీలో ఉండగానే, అనారోగ్యానికి గురై చనిపోయినట్లు వార్తలు వచ్చాయి. అయితే లాకప్ లో తన భర్తను తీవ్రంగా కొట్టారని, పోలీసుల దాడి కారణంగానే ఆయన మరణించారని భార్య జెనీ శర్మ ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే మృతుడి కుటుంబాన్ని పరామర్శించడానికి మమత వెళ్లారు. అయితే బిజ్ పూర్ వద్ద నిరసనకారులు ఆమె కారును చుట్టుముట్టారు. ఆ సమయంలో కారులో మమతతో పాటు లోక్ సభ ఎంపీ కల్యాణ్ బెనర్జీ, రాజ్యసభ ఎంపీ దోలా సేన్ కూడా ఉన్నారు. అయితే నిరసనకారులు శాంతియుతంగా ఉన్న ఆ ప్రాంతంలో అశాంతిని సృష్టించేందుకే మమత వచ్చారని ఆరోపించారు. ఆమెకు వ్యతిరేకంగా దొంగ, దొంగల రాణి అంటూ నినాదాలు చేశారు. దీనితో ఆ ప్రాంతంలో కాసేపు ఉద్రిక్తంగా మారింది. ఈ నేపథ్యంలో మమతా బెనర్జీ సువేందు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పోలీసులపై తనకు ప్రత్యేకంగా కోపం లేదని మమతా బెనర్జీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకే బలగాలు పనిచేస్తున్నాయని అన్నారు. "పోలీసులు గూండాలను కాపాడుతున్నారు. బంగాల్ గూండాల చేతుల్లోకి వెళ్లిపోయింది. దీనిపై మా పార్టీ చట్టపరంగా ముందుకు వెళ్తుంది" అని చెప్పారు.

### రెచ్చగొట్టడానికే మమత వచ్చారు!

మమతా బెనర్జీ ఆరోపణలను బీజేపీ తోసిపుచ్చింది. ఉద్రిక్తతలను రేకెత్తించడానికి, ప్రజలను రెచ్చగొట్టడానికే మమతా బెనర్జీ కాంచరపారాకు వచ్చారని బీజేపీ ప్రత్యారోపణలు చేసింది. అందుకే ఆమె రాకను స్థానిక ప్రజలు వ్యతిరేకిస్తూ నిరసనలు చేశారని పేర్కొంది.

### పెరుగుతున్న రాజకీయ దాడులు!

బంగాల్‌లో అధికార, విపక్షాల మధ్య ఇటీవల కాలంలో రాజకీయ వేడి బాగా పెరిగిపోతోందన్న విషయాన్ని తాజా ఘటన మరోసారి నిరూపించింది. ఇటీవల మమత బెనర్జీ సహా, పలువురు టీఎంసీ నేతలు ఇలాగే నిరసనలు ఎదుర్కొన్నారు. జూన్‌లో కలకత్తా హైకోర్టు ప్రాంగణం నుంచి బయటకు వస్తుండగా, మమతను ఉద్దేశించి దొంగ, దొంగ అంటూ నినాదాలు చేశారు. అది జరిగిన రెండు నెలల తర్వాత తాజా ఘటన జరగడం గమనార్హం. మమత బెనర్జీ మేనల్లుడు, టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీపై కూడా జూన్‌లో దాడి జరిగింది. సోనార్‌పూర్ లో పర్యటిస్తున్న సమయంలో ఆయన కాన్వాయ్‌పై గుడ్లు విసిరి, టీఎంసీకి వ్యతిరేకంగా నినాదాలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. టీఎంసీ అధికార ప్రతినిధి క్రిషను మిత్రా ఆ దాడి ఘటనను తీవ్రంగా ఖండించారు. మమతా బెనర్జీ వాహనంపై రాళ్లు, బురద విసరడాన్ని అత్యంత హేయమైన, ఖండించదగిన చర్యగా అభివర్ణించారు. పోలీస కస్టడీలో తమ కార్యకర్త మరణించాడనీ, ఇప్పుడు మమతపై దాడి చేశారని, దీనికి వ్యతిరేకంగా తమ పార్టీ పోరాడుతుందని పేర్కొన్నారు. సువేందు అధికారి పోలీసుల ద్వారా రాష్ట్రాన్ని నడుపుతున్నారని, రాజకీయ ప్రయోజనాల కోసం మాఫియాను వాడుకుంటున్నారని టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ ఆరోపించారు. మమతా బెనర్జీకి చెందిన భద్రతా సిబ్బంది జోక్యం చేసుకోకపోతే, పరిస్థితి మరింత ప్రమాదంగా మారేదని అన్నారు.

## నేతన్నలకు పథకాలు రాకుండా చేసి కాంగ్రెస్ ప్రభుత్వం కడుపు కొడుతోంది - కేటీఆర్

ఎన్నికల్లో నేతన్నలకు ఇచ్చిన హామీ కూడా కాంగ్రెస్ నెరవేర్చలేదన్న కేటీఆర్ - నేతన్న బీమా, నేతన్న చేయూత పథకాలను నిలిపేసిందని విమర్శలు - పథకాలను పునరుద్ధరించి నేతన్నలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రికి లేఖ

### నేతన్నల డిమాండ్ల కోసం సీఎం రేవంత్ కు కేటీఆర్ బహిరంగ లేఖ




హైదరాబాద్ : నేతన్నలకు ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు కాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వారి కడుపు కొడుతోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. ఇవాళ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని నేతన్నల తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ సంస్కృతి, అస్తిత్వానికి వెన్నెముకగా నిలిచిన చేనేత కార్మికుల పరిస్థితి కాంగ్రెస్ పాలనలో తీవ్రంగా దిగజారిందని ఆందోళన వ్యక్తం చేశారు. నేతన్నల పథకాలను పునరుద్ధరించాలి : బీఆర్ఎస్ ప్రభుత్వ అధికారంలో ఉండగా కేసీఆర్ నాయకత్వంలో అమలైన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' వంటి అనేక ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేశారని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. వాటిని నిలిపివేసి నేతన్నలను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టారని ముఖ్యమంత్రిని విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ చేనేత కార్మికులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదని ఆరోపించిన కేటీఆర్ వెంటనే అన్ని పథకాలను పునరుద్ధరించి నేతన్నలకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్థిక భరోసా కల్పించే బాధ్యత ప్రభుత్వానిదే : జాతీయ చేనేత దినోత్సవం కేవలం ఉత్సవాలు నిర్వహించుకునే రోజు కాదని, చేనేత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే విధానాలు అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేనేత సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా నిలిపివేసిందన్నారు. 'నేతన్న బీమా' అమలు కావడం లేదని, 'నేతన్నకు చేయూత' పథకం చెల్లింపులు పూర్తిగా ఆగిపోయాయని తెలిపారు. కమిషన్ల కోసమే ప్రైవేట్ వ్యక్తులకు ఆర్డర్లు : చేనేత సహకార సంఘాలకు ఇవ్వాల్సిన పావలా వడ్డీ రుణాలు, మార్కెటింగ్ రిబేట్లు నిలిచిపోయాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆరోపించారు. బతుకమ్మ చీరలు, ప్రభుత్వ యూనిఫారాల వంటి ప్రభుత్వ ఆర్డర్లలో నేతన్నలకు గతంలో ఇచ్చిన ప్రాధాన్యతను తగ్గించారని విమర్శించారు. ప్రభుత్వ ఆర్డర్లు అన్ని కమిషన్ల కోసం ప్రైవేట్ సంస్థలు, వ్యక్తులకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. నేతన్నకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ ఏమయ్యాయని ప్రశ్నించిన ఆయన అడ్డగోలుగా హామీలు ఇచ్చి అందరిని మోసం చేసినట్లుగానే నేతన్నలను కూడా మోసం చేస్తోందని మండిపడ్డారు. నేతన్నలపై రెండు ప్రభుత్వాల తీరు ఒక్కటే : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా చేనేత రంగానికి తీవ్ర అన్యాయం చేసిందని కేటీఆర్ విమర్శించారు. పార్టీలు వేరైనా చేనేత విషయంలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల వైఖరిలో ఎలాంటి తేడా లేదని ఆరోపించారు.

## హాలియాలో ఘనంగా తీజ్ (మొలకల) పండుగ వేడుకలు

**బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట.**
**వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి**



**నాగార్జునసాగర్,ఆగస్టు 9 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :**
నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని హాలియా పట్టణ కేంద్రంలో లంబాడ (బంజారా) సమాజం అత్యంత పవిత్రంగా జరుపుకునే తీజ్ (మొలకల) పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బంజారా సోదరులు, సోదరీమణులతో కలిసి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. బంజారా సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను ప్రతిబింబించే తీజ్ పండుగ సందర్భంగా మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయ పద్ధతుల్లో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి బంజారా సోదరులు, సోదరీమణులకు తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో ఐక్యత, సోదరభావం, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు ఇలాంటి సంప్రదాయ పండుగలు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. బంజారా సమాజం తరతరాలుగా కొనసాగిస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, యువజన నాయకులు, పట్టణ అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, చైర్మన్, వైస్ చైర్మన్, మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, పట్టణ నాయకులు, సోషల్ మీడియా సభ్యులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, బంజారా సోదరులు, సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు. దీంతో హాలియా పట్టణంలో తీజ్ పండుగ సందడి నెలకొంది.

## కోదాడలో 548 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాల పంపిణీ

### లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేసిన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి



**సూర్యాపేట జిల్లా ఆగస్టు 9 ప్రజా న్యూస్ నెట్వర్క్ షేక్ అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :**
కోదాడ నియోజకవర్గ పరిధిలోని కోదాడ పట్టణం పెరిక భవన్ ఫంక్షన్ హాల్‌లో 548 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయిస్తూ పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. ఎన్నో రోజులుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు జరగడంతో వారి కుటుంబాల్లో ఆనందం వ్యక్తమైంది. ప్రభుత్వం అందిస్తున్న ఇళ్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం చేకూరేలా చర్యలు కొనసాగుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి కోదాడలో ప్రజా దర్బార్

**కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి**



**సూర్యాపేట జిల్లా ఆగస్టు 9 ప్రజా న్యూస్ నెట్వర్క్ షేక్ అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :**
హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని కోదాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ప్రజా దర్బార్ నిర్వహించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను ఎమ్మెల్యే నేరుగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తమ సమస్యలను వినతిపత్రాల రూపంలో ఎమ్మెల్యేకు అందజేయగా, వాటిని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడం ద్వారా సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపేందుకు ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పుట్టుకతో వికలాంగుడైన రమేష్‌కు ఇల్లు నిర్మిస్తా: ఈరసరపు యాదగిరి


### బీర్ల ఫౌండేషన్ సహకారంతో ఇంటి నిర్మాణానికి హామీ



**గుండాల మండలం ఆగస్టు 9 ప్రజా న్యూస్ నెట్వర్క్ :**
యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని గుండాల మండల పరిధిలోని వెల్మజాల గ్రామానికి చెందిన పుట్టుకతో వికలాంగుడైన సింగారం రమేష్‌కు సొంత ఇల్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసరపు యాదగిరి స్పందించారు. రమేష్ పరిస్థితిని తెలుసుకున్న ఆయన బీర్ల ఫౌండేషన్ ద్వారా ఇంటి నిర్మాణానికి సహాయం అందిస్తామని, ఇంటి నిర్మాణం కోసం ముగ్గు పోయించి త్వరలోనే ఇల్లు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. నివాసానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న వికలాంగుడికి అండగా నిలిచి ఇంటి నిర్మాణానికి ముందుకు రావడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రమేష్ కుటుంబ సభ్యులు ఈరసరపు యాదగిరికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మార్పీఎస్‌కు కొత్త మండల సారథి.. సలికే చిన వెంకటరమణ

### సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్న నూతన అధ్యక్షుడు



**పాయకరావుపేట, ఆగస్టు 9 ప్రజా న్యూస్ నెట్వర్క్:**
పాయకరావుపేట మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా పట్టణంలోని ఇందిరా కాలనీకి చెందిన సీనియర్ నాయకులు సలికే చిన వెంకటరమణ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ నియామక ప్రక్రియ చేపట్టారు.అనకాపల్లి జిల్లా ఇంచార్జి పోసుపల్లి వెంకట్రావు అధ్యక్షతన, పాయకరావుపేట నియోజకవర్గ ఇంచార్జిలు డొక్కా అజయ్ బాబు, మారుడుపూడి సత్తిబాబు (సతీష్) సమక్షంలో సలికే చిన వెంకటరమణను మండల అధ్యక్షుడిగా నియమించారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సలికే చిన వెంకటరమణకు పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాయకరావుపేట మండలంలో ఎమ్మార్పీఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తానని తెలిపారు. మాదిగ హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడతానని పేర్కొన్నారు.తనను మండల అధ్యక్షుడిగా నియమించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ, అనకాపల్లి జిల్లా ఇంచార్జి పోసుపల్లి వెంకట్రావులకు సలికే చిన వెంకటరమణ కృతజ్ఞతలు తెలిపారు

## నేరేడుచర్ల పరిధిలో వాహనాల తనిఖీలు ముమ్మరం

### హుజూర్‌నగర్ -మిర్యాలగూడ రహదారిపై పకడ్బందీగా తనిఖీలు నిర్వహించిన నేరేడుచర్ల పోలీసులు



**సూర్యాపేట జిల్లా ఆగస్టు 9 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :** నియోజకవర్గ పరిధిలోని నేరేడుచర్ల మండలంలో హుజూర్‌నగర్ మిర్యాలగూడ ప్రధాన రహదారిపై నేరేడుచర్ల పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. రహదారిపై నిరంతరం రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, ఇతర వాహనాలను పోలీసులు నిలిపి క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల నంబర్ ప్లేట్లు తదితర వివరాలను తనిఖీ చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తున్న వాహనదారులను గుర్తించారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించడంతో పాటు రహదారులపై అక్రమ రవాణా, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు ఈ తనిఖీలను చేపట్టారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా సంచరించే వాహనాలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను తమ వెంట ఉంచుకోవాలని పోలీసులు సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్ట్ ధరించాలని, వాహనాలను అతివేగంగా నడపకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రతి వాహనదారుడు బాధ్యతగా వ్యవహరించాలని పోలీసులు సూచించారు. రహదారిపై ప్రయాణించే సమయంలో ఇతర వాహనదారులకు ఇబ్బంది కలిగించే విధంగా వాహనాలను నడపవద్దని, ప్రమాదాలకు దారితీసే నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేరేడుచర్ల మండల పరిధిలో శాంతిభద్రతలను కాపాడటంతో పాటు నేరాల నియంత్రణకు నిరంతరం నిఘా కొనసాగుతుందని పోలీసులు తెలిపారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా అవసరమైన ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ అనుమానాస్పద కార్యకలాపాలను అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాల కదలికలు కనిపించినప్పుడు వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

## బుద్ధుని బాటలో ఓ మహోన్నత సంకల్పం

**నెల్లూరు ఆగష్టు 9 ప్రజాన్యూస్ నెట్ వర్క్ :**
బుద్ధుని బోధనలను ఆచరణలో పెడుతూ.. మానవత్వమే నిజమైన ఆరాధనగా భావిస్తూ సేవా మార్గంలో ముందుకు సాగుతున్నారు గౌతమ్ బుద్ధ విహార ట్రస్ట్ వ్యవస్థాపకులు అరవ రాయప్ప. నిత్యం బుద్ధ వందనాలు చేస్తూ, ఆశ్రమ ప్రాంగణానికి చేరుకుని స్వయంగా పూలను సేకరించి బుద్ధునికి సమర్పించడం ఆయన దైనందిన జీవితంలో భాగంగా మారింది.బుద్ధుడు బోధించిన కరుణ ప్రేమ దయ, సమానత్వం వంటి విలువలను జీవన మార్గంగా స్వీకరించిన అరవ రాయప్ప తన శేష జీవితాన్ని సమాజ సేవకు అంకితం చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు ముఖ్యంగా అనాథలు నిరాశ్రయులు, వృద్ధులకు అండగా నిలిచేలా ఆశ్రమాన్ని అభివృద్ధి చేయాలన్నది ఆయన ప్రధాన లక్ష్యం.ఆశ్రమంలో ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం, ఆపన్నులకు ఆశ్రయం కల్పించడం ఆదరణకు నోచుకోని వృద్ధులకు అండగా నిలవడం అనాథలకు భద్రత కల్పించడం వంటి సేవా కార్యక్రమాలను చేపట్టాలన్నది ఆయన ఆశయంగా చెబుతున్నారు ఈ నేపథ్యంలో బుద్ధ విహార ఆశ్రమం భవిష్యత్తులో



కేవలం ఓ భవనం కాకుండా ఆకలితో ఉన్నవారికి అన్నపూర్ణగా ఆపన్నులకు ఆశ్రయంగా, ఒంటరి జీవితాలకు ఆత్మీయతగా నిలిచే మానవత్వపు నిలయంగా రూపుదిద్దుకోవాలన్నది ఆయన సంకల్పం.సబ్బే సత్తా సుఖీ హొంతు సమస్త జీవులు సుఖంగా ఉండాలన్న బుద్ధుని మహత్తర సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకుని పూజలు, ప్రార్థనలకే పరిమితం కాకుండా తోటి మనిషికి తోడుగా నిలవడమే బుద్ధుని బోధనలకు నిజమైన గౌరవమని అరవ రాయప్ప విశ్వసిస్తున్నారు.బుద్ధ విహార ఆశ్రమం అభివృద్ధి చెందితే ఎంతోమంది అనాథలు నిరాశ్రయులు వృద్ధులకు జీవితంలో ఒక భరోసా లభించే అవకాశం ఉంది. ఈ సేవా సంకల్పాన్ని గమనిస్తున్న దాతలు సేవాభావం కలిగిన వ్యక్తులు సంస్థలు ముందుకు వచ్చి తమవంతు సహకారం అందిస్తే ఆశ్రమ నిర్మాణం మరింత వేగంగా ముందుకు సాగే అవకాశం ఉంది.ఒక ఆశ్రమం నిర్మించడం అంటే కేవలం గోడలు పైకప్పులు నిర్మించడం కాదు ఆకలితో ఉన్నవారికి అన్నం ఆపన్నులకు ఆశ్రయం, అనాథలకు అండ, ఒంటరి వృద్ధులకు ఆత్మీయత అందించే మానవత్వపు నిలయాన్ని నిర్మించడం. అలాంటి మహోన్నత లక్ష్యంతో ముందుకు సాగుతున్న అరవ రాయప్ప సంకల్పం అభినందనీయం.బుద్ధుని కరుణామార్గంలో సాగుతున్న ఈ సేవా యజ్ఞానికి సమాజం అండగా నిలిస్తే బుద్ధ విహార ఆశ్రమం రేపటి రోజున ఎన్నో నిరాశ్రయ జీవితాలకు ఆశాకిరణంగా మారే అవకాశం ఉంది. ఒకరి సంకల్పానికి సమాజం తోడైతే అది వందలాది జీవితాలకు వెలుగునిస్తుంది.

## 'నేతన్న సేవలో'పై ఆరోపణలు సరికాదు: చేనేత కారులు

### ప్రతి లబ్ధిదారుడి ఇంటికి వస్తాం.. రూ.25 వేల సాయం అందిందని స్పష్టం



**తుని, ఆగస్టు 9 ప్రజా న్యూస్ నెట్వర్క్:**
'నేతన్న సేవలో' పథకం పేరుతో డబ్బులు వసూలు చేశారంటూ మాజీ మంత్రి దాడిశెట్టి రాజా చేసిన ఆరోపణలపై తుని మండలం డి.పోలవరం, కేవో మల్లవరం గ్రామాలకు చెందిన చేనేత కారులు స్పందించారు. పథకం ద్వారా ప్రయోజనం పొందిన ప్రతి కుటుంబం వద్దకు వెళ్లి వాస్తవాలను తెలుసుకోవాలని వారు సవాల్ చేశారు.ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు.తమ కులవృత్తినే జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్న చేనేత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం రూ.25 వేల ఆర్థిక సాయం అందించిందని కార్మికులు తెలిపారు. ఎలాంటి రాజకీయ వివక్షకు తావులేకుండా ప్రతి కార్మికుడికీ ఈ ప్రయోజనం అందిందని స్పష్టం చేశారు. పథకం పేరుతో డబ్బులు వసూలు చేశారనే సమాచారం వాస్తవం కాదని, తప్పుడు సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ఆరోపణలు చేయడం సరికాదన్నారు.నేతన్నలకు అందుతున్న ఆర్థిక సాయంపై ఇలాంటి ఆరోపణలు చేయడం వల్ల భవిష్యత్తులో అర్హులైన చేనేత కార్మికులకు ప్రయోజనాలు దూరమయ్యే ప్రమాదం ఉందని వారు పేర్కొన్నారు. ఆరోపణలు చేసే ముందు వాటిలో వాస్తవం ఉందా లేదా అనే విషయాన్ని నిర్ధారించుకోవాలని మాజీ మంత్రికి సూచించారు.తాతముత్తాతల కాలం నుంచి చేనేత వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న తమను కూటమి ప్రభుత్వం ఆదుకుంటోందని డి.పోలవరం, కేవో మల్లవరం చేనేత కారులు తెలిపారు. తమ గ్రామాల్లో 122 మందికి 'నేతన్న సేవలో' పథకం కింద రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం అందడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.గత ప్రభుత్వ హయాంలో డి.పోలవరంలో 76 మందికి మాత్రమే, అదికూడా మగ్గం ఉన్న కార్మికులకు మాత్రమే ఈ పథకం వర్తించిందని చేనేత కారులు పేర్కొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేనేతపై ఆధారపడిన అన్ని కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనం కల్పించిందని తెలిపారు. రాజకీయ వివక్ష లేకుండా ప్రతి కార్మికుడికీ ఆర్థిక ప్రయోజనం అందిందని వారు స్పష్టం చేశారు.

## శ్రీప్రకాష్‌లో హ్యాండ్‌బాల్ పోటీలకు తుది సమరం

### క్వార్టర్‌ఫైనల్స్, సెమీఫైనల్స్‌లో హోరాహోరీ పోరు.

### నేడు ఫైనల్స్, బహుమతి ప్రదానోత్సవం



**శ్రీప్రకాష్, ఆగస్టు 10 ప్రజా న్యూస్ నెట్వర్క్:**
శ్రీప్రకాష్ వేదికగా ఆగస్టు 7 నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తున్న సౌత్ జోన్--1 హ్యాండ్‌బాల్ పోటీలు ఉత్కంఠభరితంగా కొనసాగుతున్నాయి. పోటీల్లో భాగంగా మూడో రోజు క్వార్టర్‌ఫైనల్స్, సెమీఫైనల్స్ మ్యాచ్‌లు హోరాహోరీగా జరిగాయి. విజయం కోసం క్రీడాకారులు చివరి వరకు పోరాడుతూ ప్రతిభను ప్రదర్శించారు.పోటీల ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి కాకినాడ ఎన్.సి.సి గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్ ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. అనంతరం విజేతలకు బహుమతుల ప్రదానం జరగనుంది.కార్యక్రమంలో శ్రీప్రకాష్ విద్యానికేతన్ సీనియర్ ప్రిన్సిపల్ ఎం.వి.వి.ఎస్. మూర్తి, ప్రిన్సిపల్ కె. రవి, సిబిఎస్ఈ పరిశీలకులు స్వామి, కోచ్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

### బజాజ్ పల్సర్ ఎన్160 కొత్త అవతార్.. ధరలు, ఫీచర్లు ఇవే


- బజాజ్ కొత్త పల్సర్ ఎన్160ను విడుదల
- రెండు వేరియంట్ల ధరలు రూ.1.33 లక్షల నుంచి ప్రారంభం
- 165 సీసీ నాలుగు వాల్వుల ఇంజిన్
- నాలుగు రైడింగ్ మోడ్‌లు, ట్రాక్షన్ కంట్రోల్
- క్రాల్ టెక్నాలజీతో సిటీ ట్రాఫిక్ లో ప్రయాణం మరింత సులభం
- ఐదు అంగుళాల రంగుల స్క్రీన్‌లో గూగుల్ మ్యాప్స్
- మూడు కొత్త రంగుల్లో అందుబాటులోకి బైక్



## గొలుసుకట్టు వ్యాపారాల మాయలో పడొద్దు



ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ హెచ్చరించారు. ముఖ్యంగా మల్టీ లెవెల్ మార్కెటింగ్ (ఎంఎల్ఎం), గొలుసుకట్టు వ్యాపారాల పేరుతో ప్రజలను ఆకర్షించి ఆర్థికంగా మోసం చేస్తున్నారని తెలిపారు."మీ కింద ఎక్కువ మంది ఏజెంట్లను చేర్పిస్తే తక్కువ సమయంలో భారీ లాభాలు, రివార్డులు, పాయింట్లు పొందవచ్చు" అంటూ చేసే ప్రచారాలను ఎవరూ నమ్మవద్దని ఎస్పీ సూచించారు. ఇలాంటి మాయమాటలను నమ్మి అత్యాశకు పోతే భారీగా ఆర్థిక నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు.వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ తదితర సోషల్ మీడియా వేదికల ద్వారా ఆకర్షణీయమైన ప్రకటనలు చేస్తూ అమాయకులను వలలో వేసుకుంటున్నారని తెలిపారు. లగ్జరీ కార్లు, విదేశీ పర్యటనలు, భారీ లాభాలు అంటూ ప్రజలను ప్రలోభపెట్టి ముఠాలు మోసాలకు పాల్పడుతున్నాయని పేర్కొన్నారు.గొలుసుకట్టు మార్కెటింగ్‌లో ముందుగా చేరిన కొంతమందికి లాభాలు వచ్చినప్పటికీ, ఆ తర్వాత చేరే వారిలో ఎక్కువ మంది తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఇలాంటి నెట్‌వర్క్‌లలో ఎవరూ చేరవద్దని, ఆయా సంస్థలు నిర్వహించే సభలు, సమావేశాలకు కూడా హాజరుకావద్దని సూచించారు.సోషల్ మీడియాలో వచ్చే అనుమానాస్పద ప్రకటనలు, వెబ్ లింక్‌లపై క్లిక్ చేయవద్దని, గుర్తుతెలియని ఏపీకే (ఫ్రాఖ) ఫైళ్లను డౌన్‌లోడ్ చేయవద్దని ఎస్పీ హెచ్చరించారు. "అతి తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని ఎవరైనా చెబితే అది మోసమని ముందుగా గుర్తించాలి. అత్యాశకు పోతే మోసపోవడం ఖాయం" అని తెలిపారు.ఎవరైనా మోసపోయినట్లయితే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రజలకు సూచించారు.




# 12న ఇరుముడి ట్రైలర్ విడుదలకు సన్నాహాలు

మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇరుముడి' ట్రైలర్‌ను ఆగస్టు 12న విడుదల చేయనున్నారు. భీమవరంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఈ ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. 'నిన్ను కోరి', 'టక్ జగదీష్' వంటి చిత్రాలతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది. ఇప్పటివరకు సినిమాకు సంబంధించి విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, ఇతర ప్రచార చిత్రాలు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్‌ను అందుకున్నాయి. ముఖ్యంగా కుటుంబ కథాంశానికి భక్తి అంశాలను జోడించి సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తుండటంతో 'ఇరుముడి'పై అంచనాలు మరింత పెరిగాయి. ట్రైలర్ విడుదల కార్యక్రమానికి చిత్ర బృందంతో పాటు అభిమానులు, సినీ ప్రేక్షకులు భారీగా హాజరయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే 'ఇరుముడి' నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై పాజిటివ్ వైబ్స్‌ను తీసుకొచ్చింది. దీంతో ట్రైలర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ భావోద్వేగాలు, భక్తి అంశాలతో పాటు రవితేజకు సంబంధించిన మాస్ ఎలివేషన్స్‌ను ట్రైలర్‌లో ఎలా చూపించారనేది ఆసక్తికరంగా మారింది. ట్రైలర్ కూడా ప్రేక్షకులను మెప్పిస్తే సినిమా విడుదలకు ముందే హైప్ మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా రవితేజను శివ నిర్వాణ ఏ తరహా పాత్రలో చూపించారనే విషయం ట్రైలర్ ద్వారా స్పష్టత వచ్చే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తున్నారు. రవితేజ కుమార్తె పాత్రలో బేబీ నక్షత్ర కనిపించనుంది. కుటుంబ బంధాలు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉన్న కథలో ఈ తండ్రీకూతుళ్ల బంధం కీలకంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. మాస్ మహారాజా ఇమేజ్‌కు భిన్నంగా కుటుంబ భావోద్వేగాలను, భక్తి అంశాలను కలగలిపి శివ నిర్వాణ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. దీంతో 'ఇరుముడి' రవితేజ కెరీర్‌లో మరో విభిన్నమైన సినిమాగా నిలుస్తుందా అన్న ఆసక్తి నెలకొంది. కాగా 'ఇరుముడి' ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# రామాయణ తొలుత విదేశాల్లో విడుదల




రామాయణం ఇతిహాసం ఆధారంగా తెరకెక్కుతోన్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణ' ప్రపంచవ్యాప్త విడుదలపై నిర్మాత నమిత్ మల్హోత్రా కీలక ప్రకటన చేశారు. ఈ సినిమాను అంతర్జాతీయ మార్కెట్‌లో ముందుగా.. ఆ తర్వాత భారత్‌లో విడుదల చేసేలా వినూత్న వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు వెల్లడించారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాతో ఆయన మాట్లాడారు. నవంబర్ 6న విదేశాల్లో 'రామాయణ' విడుదల చేస్తున్నాం. విదేశీ మార్కెట్లలో సినిమాల విడుదల సాధారణంగా శుక్రవారం నుంచే ప్రారంభమవుతుంది. ఇండియాలో మాత్రం దీపావళి నవంబర్ 8 రోజే విడుదల చేస్తాం అని చెప్పారు. దిగ్గజ దర్శకుడు నితీశ్ తివారీ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ భారీ బడ్జెట్ దృశ్యకావ్యంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణాసురుడిగా యష్, హనుమంతుడిగా సన్నీ దేవోల్, లక్ష్మణుడిగా రవి దూబే నటిస్తున్నారు. ఆస్కార్ విజేతలు ఏ.ఆర్. రెహమాన్, హన్స్ జిమ్మర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఇండియాలో ధర్మ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని పంపిణీ చేస్తుండగా, ఓవర్సీస్ హక్కులను సోనీ పిక్చర్స్ దక్కించుకుంది. సంగీత హక్కులను టీ-సిరీస్ రూ. 75 కోట్లకు సొంతం చేసుకున్నట్లు సమాచారం.


# త్రివిక్రమ్‌తో మా బంధం బలమైనది

## సూర్యదేవర నాగవంశీ వెల్లడి

ఒక బ్యానర్‌లో పనిచేసే వ్యక్తుల మధ్య మంచి అనుబంధం ఏర్పడితే.. అదే బంధం కొనసాగుతుందని, దానికి ప్రత్యేకమైన అగ్రిమెంట్లు అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నాగవంశీ.. నిర్మాతల కాంపౌండ్స్, దర్శకుడు త్రివిక్రమ్‌తో తమ కుటుంబానికి ఉన్న అనుబంధం గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో వారి కుటుంబానికి ఉన్న అనుబంధం గురించి నాగవంశీ మాట్లాడుతూ.. తన బాబాయి (చిన్నబాబు) ఇండస్ట్రీలోకి రావాలని అనుకున్న సమయంలో తొలి సినిమాను త్రివిక్రమ్ దర్శకత్వంలోనే చేయాలని కోరుకున్నారని తెలిపారు. త్రివిక్రమ్ పనితీరు, సినిమాలపై ఆయనకు ఉన్న అభిమానం కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఆ సమయంలో 'జులాయి' సినిమా ప్రారంభమైనప్పటి నుంచి త్రివిక్రమ్‌తో తమ అనుబంధం మరింత బలపడిందని నాగవంశీ పేర్కొన్నారు. 'హారిక అండ్ హాసిని క్రియేషన్స్' అనే బ్యానర్ పేరును కూడా త్రివిక్రమే సూచించారని, ఆ బ్యానర్ లోగోను సైతం ఆయనే డిజైన్ చేశారని వెల్లడించారు. 'అప్పటి నుంచి ఇప్పటివరకు త్రివిక్రమ్ బయట బ్యానర్‌లో సినిమా చేయలేదు. దీనికి ఎలాంటి అగ్రిమెంట్లు లేవు. మా మధ్య ఉన్న రిలేషన్‌షిప్ అలాంటిది. ఒక ఫ్యామిలీలా అయిపోయాం' అని నాగవంశీ చెప్పుకొచ్చారు. త్రివిక్రమ్ తమ బ్యానర్‌తోనే వరుసగా సినిమాలు చేస్తూ ప్రయాణం కొనసాగిస్తున్న నేపథ్యంలో.. తమ వైపు నుంచి కూడా ఆయనకు ఎక్స్‌క్లూజివిటీ ఇవ్వడం సహజమేనని నాగవంశీ అన్నారు. 'హారిక అండ్ హాసిని క్రియేషన్స్' బ్యానర్‌ను ప్రధానంగా త్రివిక్రమ్ సినిమాల కోసం కొనసాగిస్తున్నట్లు వివరించారు. అయితే త్రివిక్రమ్‌కు ఆ బ్యానర్‌లో వాటా ఉందనే ప్రచారంపై కూడా నాగవంశీ క్లారిటీ ఇచ్చారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్‌లో త్రివిక్రమ్‌కు ఎలాంటి షేర్ లేదని, ఆయనకు రెమ్యునరేషన్ మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. ఆయనకు సంబంధించిన షేర్ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో ఉంటుందని తెలిపారు. అలాగే సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌కు సంబంధించిన ప్రాజెక్టుల్లో త్రివిక్రమ్ కీలకంగా భాగస్వామ్యం అవుతున్నారని, స్క్రిప్టులు, ఇతర సినిమా విషయాల్లో ఆయన సలహాలు కూడా తీసుకుంటామని నాగవంశీ వెల్లడించారు. త్రివిక్రమ్‌తో తమ బంధం కేవలం సినిమాలకు సంబంధించినది మాత్రమే కాదని.. సంవత్సరాలుగా కొనసాగుతున్న అనుబంధమే తమ ప్రయాణానికి కారణమని నాగవంశీ చెప్పుకొచ్చారు.



# 1 బిలియన్ కలెక్షన్ల క్లబ్‌లో ది ఒడిస్సీ



హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కించిన తాజా విజువల్ వండర్ 'ది ఒడిస్సీ' బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. థియేటర్లలో విడుదలైన మూడు వారాల్లోనే ఈ ఫాంటసీ యాక్షన్ డ్రామా ప్రపంచవ్యాప్తంగా 1 బిలియన్ కలెక్షన్ల క్లబ్‌లో (దాదాపు రూ.9,500 కోట్లకు పైగా) అడుగుపెట్టింది క్రిస్టోఫర్ నోలన్ కెరీర్‌లో 1 బిలియన్ మార్కును అందుకున్న మూడో చిత్రంగా 'ది ఒడిస్సీ' నిలిచింది. అంతకుముందు ఆయన దర్శకత్వం వహించిన 'ది డార్క్ నైట్' (1.008 బిలియన్), 'ది డార్క్ నైట్ రైజెస్' (1.08 బిలియన్) ఈ ఘనత సాధించాయి. గతేడాది వచ్చిన 'ఓపెన్‌హైమర్' ఈ మార్కుకు కాస్త దూరంలో ఆగిపోయింది. కాగా, ఈ వీకెండ్ ముగిసేసరికి 'ది ఒడిస్సీ' నోలన్ కెరీర్‌లోనే అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రంగా నిలవడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒక్క ఐమాక్స్ స్క్రీన్ల నుంచే ఏకంగా 257 మిలియన్ డాలర్ల వసూళ్లు (దాదాపు రూ.2,445 కోట్లు) రావడం విశేషం. త్వరలోనే ఐమాక్స్ చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగానూ ఇది నిలవనుంది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మార్కెట్ అయిన చైనాలో ఈ సినిమా విడుదల కావాల్సి ఉంది. చైనా వ్యాప్తంగా దాదాపు 800 ఐమాక్స్ స్క్రీన్లతో పాటు వేలాది సాధారణ స్క్రీన్లలో అత్యంత భారీ స్థాయిలో విడుదల చేయడానికి మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నారు. దీంతో ఈ సినిమా మరిన్ని రికార్డులను తిరగరాయడం ఖాయంగా కనిపిసోంది.

# కొరియన్ కనకరాజుతో హిట్ కొట్టిన

## వరుణ్ తేజ్




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్‌కు గత కొంతకాలంగా హిట్ కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'కొరియన్ కనకరాజు' వరుణ్ తేజ్‌కు భారీ ఊరటనిచ్చేలా బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ హారర్ కామెడీ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితిక నాయక్ హీరోయిన్‌గా నటించింది. సత్య కీలక పాత్రలో కనిపించారు. విడుదలకు ముందు నుంచే మంచి బజ్‌ను సొంతం చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం 'కొరియన్ కనకరాజు' ప్రీమియర్స్, తొలి రోజు కలిపి రూ.10.2 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు చిత్ర బృందం ప్రకటించింది. హారర్ కామెడీ జోనర్‌లో తెరకెక్కిన సినిమాకు ఇది మంచి ఓపెనింగ్‌గా చెప్పొచ్చు. అంతేకాదు.. వరుణ్ తేజ్ కెరీర్‌లో ఇదే బిగ్గెస్ట్ ఓపెనర్గా నిలిచినట్లు మేకర్స్ వెల్లడించారు. గతంలో వరుణ్ తేజ్‌కు అత్యధిక ఓపెనింగ్ అందించిన 'గద్దలకొండ గణెళిష్' సినిమాను 'కొరియన్ కనకరాజు' అధిగమించింది. దీంతో చాలా కాలం తర్వాత వరుణ్ తేజ్ అభిమానుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. దేశీయ మార్కెట్‌తో పాటు ఓవర్సీస్‌లోనూ సినిమా మంచి ఆరంభాన్ని అందుకుంది. ముఖ్యంగా అమెరికాలో ఇప్పటివరకు 1.75 లక్షల డాలర్ల గ్రాస్ సాధించినట్లు సమాచారం. సినిమా థియేట్రికల్ రైట్స్‌కు అనుగుణంగా చూస్తే ఇదే ట్రెండ్‌ను కొనసాగిస్తే బ్రేక్ ఈవెన్ దిశగా వెళ్లే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. విడుదలకు ముందే అడ్వాన్స్ బుకింగ్స్‌లో కూడా 'కొరియన్ కనకరాజు' మంచి జోరు చూపించింది. బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ యాప్‌లలో కలిపి 2.5 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు చిత్ర బృందం వెల్లడించింది. తొలి రోజు వసూళ్లతో పాటు సినిమాకు వస్తున్న మౌత్ టాక్ కూడా పాజిటివ్‌గా ఉండటం మేకర్స్‌కు మరింత కలిసొచ్చే అంశంగా మారింది.